

### కడపలో పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది
కడపలో పని చేసిన రోజులు ఎంతో సంతృప్తిని ఇచ్చాయని రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. -IIలో..



### వడ్డెర్ల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి
వడ్డెరుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ఎనలేని కృషి చేస్తున్నారని వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్ రేవతి పేర్కొన్నారు. -IIలో..



### వైద్యుడా.. వందనం
వైద్యోనారాయణ హరీ...! అంటారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం. -IIలో..

## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం
కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023 కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. తమ అర్హతల ఆధారంగా సెల్ఫ్ నామినేషన్ పద్ధతిలో జులై 15వ తేదీ లోపు http://nationalawardstoteacher.education.gov.in నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.

### జిల్లాలో ముగిసిన పసుపు కొనుగోలు
కడప అగ్రికల్చర్: జిల్లాలో జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభించిన పసుపు కొనుగోలు కార్యక్రమం జూన్ 30వ తేదీతో ముగిసిందని మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి తాడిగొట్ల నరసింహారెడ్డి తెలిపారు. ప్రభుత్వం క్వింటాల్‌కు ప్రకటించిన రూ. 6850 మద్దతు ధరతో జిల్లాలో 890 మంది రైతుల నుంచి 1916 మెట్రిక్ టన్నుల పసుపు కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే సుమారు 1.2 కోట్ల రూపాయలను రైతు ఖాతాలకు జమచేసినట్లు ఆయన తెలిపారు.

### జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అన్నపూర్ణ


కడప అర్బన్: కడపలోని జిల్లాకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా శుక్రవారం సాయంత్రం పి. అన్నపూర్ణ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం పదవీ విరమణ చేసిన వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి నుంచి పి. అన్నపూర్ణ బాధ్యతలను తీసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో 9వ అదనపు జిల్లా జడ్జిగా పి. అన్నపూర్ణ పనిచేస్తూ వైఎస్ఆర్ జిల్లాకు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వచ్చారు.

### అరుణాచలానికి స్పెషల్ సర్వీసులు
కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి గిరి ప్రదర్శనకు జూలై 3న పౌర్ణమి సందర్భంగా వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2వ తేదీ కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల నుంచి గిరి ప్రదర్శన కోసం వెళ్లే భక్తులకు ప్రత్యేక ప్యాకేజీగా సూపర్‌లగ్జరి బస్ సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ కింద రానూ పోనూ ఒక్కొక్కరికి కడప నుంచి రూ. 1072, ఇంద్ర రూ. 1384, పులివెందుల నుంచి రూ.1242, మైదుకూరు నుంచి ఇంద్ర రూ. 1604, ప్రొద్దుటూరు నుంచి ఇంద్ర రూ.1604, జమ్మలమడుగు నుంచి రూ.1352 ధర నిర్ణయించినట్లు వివరించారు. ఆసక్తి గల వారు సీట్లు రిజర్వ్ చేసుకోవాలని సూచించారు. అలాగే ఒకే బ్యాచ్‌గా 30 మంది ఉంటే ప్రత్యేకంగా బస్ సర్వీసు ఏర్పాటు చేసి పికప్, డ్రాపింగ్ చేస్తామని చెప్పారు. ఇతర వివరాలకు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

### షిర్డికి ప్రత్యేక బస్సు
కడప కోటిరెడ్డిసర్కిల్: గురు పౌర్ణమి సందర్భంగా జూలై1 ప్రొద్దుటూరు డిపో నుంచి షిర్డికి ఏసీ బస్సును ఏర్పాటు చేశామని ఆర్ఎం తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రొద్దుటూరు నుంచి బయలుదేరి ఆలంపూర్, జోగులాంబ అమ్మవారి ఆలయం, తుల్జాపూర్ భవాని మాత ఆలయం, శని శింగణాపూర్ ఆలయాలను సందర్శించవచ్చన్నారు. రానూ పోనూ రూ.4600 ధరగా నిర్ణయించామన్నారు. మైదుకూరు, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు ప్రాంతాల నుంచి కూడా టికెట్ రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని షిర్డి సాయిబాబా భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### విద్యను బలోపేతం చేయాలి


మెటీరియల్ సూపర్‌వైజర్లకు అందజేస్తున్న పీడీ శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డి సర్కిల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో హబ్ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ఐటీసీ ద్వారా మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ డబ్ల్యూడీ, సీడబ్ల్యూ ఐటీసీల ద్వారా ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థల మధ్య జరిగిన ఎంఓయులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రతి ప్రాజెక్టు నుంచి రెండు హబ్ అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించామన్నారు. జిల్లాలో మొత్తం 24 హబ్ అంగన్‌వాడీ కేంద్రాలకు ఐటీసీ ద్వారా మెటీరియల్‌ను అందజేస్తున్నామన్నారు. ఈ మెటీరియల్‌ను సీడీపీఓల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# ఆహార శుద్ధి..ఆర్థిక వృద్ధి

- పీఎంఎఫ్ఎంఈ పథకంలో వ్యక్తిగత, గ్రూపులకు సహకారం
- ప్రాజెక్టు వ్యయంపై 35 శాతం రాయితీ
- జిల్లావ్యాప్తంగా దరఖాస్తుల ఆహ్వానం



బిస్కెట్ తయారీకి సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్

కడప అగ్రికల్చర్: నేడు ఆహార శుద్ధి రంగం అసంఘటితంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా కుటుంబాలు వీటిపై అధారపడి జీవనం సాగిస్తున్నాయి. అలాంటి పరిశ్రమలు సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. వీటికి పునరుజ్జీవం తీసుకొచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ తరపున ప్రధానమంత్రి- సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం(పీఎంఎఫ్ఎంఈ) కింద చేయూతనందించనుంది. వ్యాపారంలో అన్ని విధాలుగా తోడ్పడి అధునిక సాంకేతికతతో మిమ్మల్ని సంఘటిత రంగంలో ఉన్న పెద్ద వ్యాపారులకు దీటుగా నిలబెట్టాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు.ఇందులో చిన్న ఆహార తయారీ పరిశ్రమలకు, పాత పరిశ్రమల అభివద్ధికి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేయూతనందించేందుకు రాష్ట్రం ఈ బహత్తర పథకాన్ని ప్రవేశపెట్టింది.

**నిరుద్యోగ యువతకు చేయూత...**

ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఆహార సంబంధిత పరిశ్రమల అభివృద్ధి చేయాలనుకునే వారికి, నూతన పరిశ్రమ స్థాపించాలనుకుంటున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటును అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇందుకు సంబంధించి పచ్చళ్లు, అప్పడాలు, బిస్కెట్లు, ప్రాసెస్డ్ సుగంధ ద్రవ్యాలు, మిల్లెట్ సంబంధింత ఉత్పత్తులు తదితర సూక్ష్మతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు, గతంలో ఏర్పాటు చేసుకున్న పరిశ్రమల్లో ఉత్పత్తి సామర్థ్యం పెంపొందించేందుకు సాంకేతిక, ఆర్థిక తోడ్పాటును అందించడానికి కృషి చేస్తున్నాయి.

**ఆర్థిక తోడ్పాటు..**

లబ్ధిదారులు వ్యాపారాభివృద్ధికి కావాల్సిన అధునాతన పరికరాల కొనుగోలు, వర్క్‌షెడ్లు అయ్యే వ్యయంలో 10 శాతం మాత్రమే లబ్ధిదారుడి పెట్టుబడి. ప్రభుత్వం బ్యాంకు ద్వారా 90 శాతం రుణం సౌకర్యం, 35 శాతం సబ్సిడీ సౌకర్యం కల్పిస్తోంది. వ్యాపారాన్ని సమున్నత స్థాయికి తీసకెళ్లడానికి అవలంబించాల్సిన అధునిక పద్ధతులు, పరికరాల వాడకంపై నిపుణులతో సూచనలు, దీనికి కావాల్సిన శిక్షణ ఇవ్వనుంది. దీంతోపాటు సంఘటిత రంగంలో ఉన్న పెద్ద రిటైల్ వ్యాపారులతో సమన్వయ పరుస్తూ, పెద్ద బ్రాండ్లకు దీటుగా నిలవడానికి కావాల్సిన బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించనుంది. పోటీ తట్టుకోవడానికి కావాల్సిన మెలకువలు, అవలంబించాల్సిన పద్ధతులపై శిక్షణ ఇప్పించనుంది.

**అర్హులెవరంటే..**

18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలి.ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో తమ పరిశ్రమ అభివృద్ధి లేదా నూతన పరిశ్రమ స్థాపన చేయగలిగిన వారై ఉండాలి. విద్యార్హత లేకపోయినా అర్హులు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు, యువత, మహిళలు, రైతులు, స్వయం సహాయక బృందాలు, రైతు సహకారం సంఘాలు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

**దరఖాస్తు చేసే విధానం..**

లబ్ధిదారులు సంబంధిత రిపోర్స్ పర్సన్‌ను, జిల్లా అధికారిని సంప్రదించాలి. నిర్ణీత సమాచారం, డ్యాక్యుమెంట్లు సమర్పించి వారితో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. ఈ పక్రియ పూర్తిగా ఉచితం. ప్రభుత్వ పరిశీలన తర్వాత అప్లికేషన్ బ్యాంకుకు నివేదిస్తారు. దీని నిమిత్తం లబ్ధిబారులు బ్యాంకును తామే ఎంపిక చేసుకోవచ్చు.అప్లికేషన్ స్థాయి నుంచి లబ్ధిదారుడ యూనిట్ స్థాపించి విజయవంతంగా నడుపుకునే వరకు సూచనలు ఇవ్వడానికి రిసోర్సు పర్సన్ వెన్నంటే ఉంటారు.

**సమర్పించాల్సిన పత్రాలు...**

అభ్యర్థి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పరిశ్రమ తాలుకు అడ్రస్ ప్రూఫ్(వాటర్, కరెంట్ బిల్లు, ఫోన్, గ్యాస్ బిల్లు) సమర్పించాలి. పరిశ్రమ నిర్వహించే బిల్డింగ్, భూమి తాలుకూ ఓనర్‌షిప్ ధ్రువీకరణకు కావాల్సిన రుజువు, 6 నెలల బ్యాంకు స్టేట్‌మెంట్, అప్‌డేట్ చేసిన పాసుబుక్, కోనుగోలు చేయాలనుకుంటున్న మిషనరీ లేదా నిర్మించాలనుకుంటున్న షెడ్డు తాలుకు కోటేషన్ ఇవాల్సి ఉంటుంది.

**ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలి**



చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందకు ఆసక్తి ఉన్న వారు వారి పరిధిలో ఉండే డీఆర్‌సీలను కలిసి దరఖాస్తు చేసుకోవాలి. వారు దరఖాస్తును పరిశీలించి అర్హత ఉందో లేదో తేలుస్తారు. అర్హత ఉంటే అన్ని పరిశీలించి పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తారు. ఇందకు సంబంధించి జిల్లాలో ప్రస్తుతం డ్రైవ్ జరుగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలోని 16 మండలాల్లో క్యాంపెయిన్ ముగిసింది. మిగతా మండలాల్లో వచ్చే నెల 19వ తేదీ వరకు డ్రైవ్ ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు డ్రైవ్‌లో పాల్గొంటే పూర్తిస్థాయి అవగాహన వస్తుంది. – ఐకే మైఖేల్ రాజీవ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

### ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు నష్టపరిహారం

- జులై 8వ తేదీన రైతుల ఖాతాకు నగదు జమ
- రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి


కడప అగ్రికల్చర్: జిల్లాలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షంతో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించిన నష్ట పరిహారాన్ని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాక మునుపే రైతులకు నష్ట పరిహారాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 2022 ఖరీఫ్‌లో సాగు చేసిన పలు వ్యవసాయ, ఉద్యాన పంటలు అకాల వర్షం కారణంగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో అన్ని పంటలకు దిగుబడులు తగ్గి రైతులందరూ తీవ్రంగా నష్టపోయారన్నారు. దీనిపై ప్రభుత్వం అన్ని నివేదికలను తెప్పించుకుని వాతావరణ ఆధారిత బీమా కింద జిల్లాలో 21,606 రైతులకుగాను 64,34,40,576 రూపాయలను మంజూరు చేసిందన్నారు. అలాగే పంట దిగుబడి ఆదార బీమా కింద 57,053 మంది రైతులకుగాను 139,16,06,411 రూపాయల నష్ట పరిహారాన్ని మంజూరు చేసిందన్నారు. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వివరాలను తెలుసుకుని ఏవైనా ఫిర్యాదులు ఉంటే జులై 4వ తేదీలోపు ఆర్‌బీకేలలో తెలియచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పరిహారం మొత్తాన్ని జులై 8 వైఎస్సార్ జయంతి రోజున రైతుల ఖాతాలకు జమచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ టెక్నికల్ అధికారి జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

# షూటింగ్ సందడి



పింఛా నదిలో షూటింగ్ సందడి

సుండుపల్లె (రాజంపేట): నియోజకవర్గంలోని సుండుపల్లె మండలంలోని పింఛా నదిలో భారతీయుడు-2 సినిమా షూటింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. తమిళనాడుకు చెందిన కళాకారులు రంగంలోకి దిగి సినిమా షూటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అద్భుతమైన సెట్టింగ్స్‌ను నిర్మితం చేశారు. దేవాండ్లపల్లె బ్రిడ్జి వద్ద సినిమా షూటింగ్‌కు సంబంధించిన సన్నివేశాలను తీస్తున్నారు. తమిళ దర్శకుడు శంకర్ నేతృత్వంలో జరుగుతున్న ఈ షూటింగ్ సన్నివేశాలను అద్భుతంగా తీస్తున్నారు. చెన్నై, తిరుపతి నుంచి తమిళ కళాకారులు ఇక్కడ చేరుకొని షూటింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ప్రత్యేక హెలిక్యాప్టర్ ద్వారా దేవాండ్లపల్లె బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. సినీనటుడు కమలహాసన్ తదితర నటీనటులు చిత్రీకరణ స్థలానికి చేరుకున్నారు. ఈ షూటింగ్‌ను చూసేందుకు జనం తరలివచ్చారు.



దర్శకుడు శంకర్,



కమలహాసన్

కేవీపల్లె : మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పరిధిలో 'భారతీయుడు-2' సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శంకర్ దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమా షూటింగ్‌కు జిల్లేళ్లమంద పంచాయతీ దేవాండ్లపల్లె సమీపంలో పింఛా నదిపై ఉన్న బ్రిడ్జికి కొంత సెట్టింగ్ ఏర్పాటు చేశారు. శుక్రవారం నటీనటులు కమల్‌హాసన్, కాజల్ షూటింగ్‌కు హాజరు కావడంతో వారిని చూడడానికి చుట్టు పక్కల గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

### సింహ వాహనంపై సౌమ్యనాథుడు



సింహ వాహనంపై ఊరేగుతున్న సౌమ్యనాథుడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా సౌమ్యనాథుడు శుక్రవారం సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం తిరుచ్చిపై మాఢవీధుల్లో వేణు గానాలంకరణలో సౌమ్యనాథస్వామి విహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టరు దిలీప్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల నాని, పెనుబాల నాగసుబ్బయ్య, కాకిచంద్ర తదితరులు పాల్గొన్నారు. –నందలూరు (రాజంపేట)

### చంద్ర ప్రభ వాహనంపై శ్రీ సిద్దేశ్వరస్వామి



చంద్రప్రభ వాహనంపై సిద్దేశ్వరస్వామి

తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీ సిద్దేశ్వర స్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పురవీధుల్లో స్వామివారికి భక్తులు కాయకర్పూరం సమర్పించుకున్నారు. అలాగే శ్రీ చెన్నకేశవస్వామి హంసవాహనంపై ఊరేగారు. బ్రహ్మోత్సవాలతో తాళ్లపాకలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టరు బాలాజీ , సర్పంచ్ గౌరీశంకర్, గ్రామస్తులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు. –రాజంపేట

# సంక్షేమ పథకాలన్నీ సకాలంలో విద్యార్థులకు అందాలి

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్



ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ పరిశీలిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను సకాలంలో అందించి వారి విద్యాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కడపకు విచ్చేసి సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా కడప నగరంలోని నగరపాలక ఉర్దూ బాలికల పాఠశాల, సెయింట్ జోసెఫ్ బాలికల ఉన్నత పాఠశాల, శాస్త్రీనగర్ నగర పాలక ప్రాథమిక పాఠశాలతోపాటు 46వ డివిజన్‌లోని సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆయన జగనన్న విద్యాకానుక గురించి విద్యార్థులతో ఆరా తీశారు. అలాగే పాఠశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను (ఐఎఫ్‌పి) పరిశీలించి ప్యానల్‌పై పెన్‌తో రాసి పరిశీలించారు. సెయింట్ జోసఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాకానుక వస్తువులపై ఆరా తీశారు. శాస్త్రీనగర్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన మెనూ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. 46వ డివిజన్‌లోని నగరపాలక సచివాలయంలో సిబ్బందితో చర్చించారు. విద్యాశాఖ సంక్షేమ పథకాలను విద్యార్థులకు సకాలంలో అందించాలన్నారు. ఈయన వెంటన జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్టారెడ్డి, ఇంటర్ ఆర్‌జేడీ రవి, డీఈఓ రాఘవరెడ్డి, సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ పాలెం నారాయణ, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ఆరా

చెన్నూరు : రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రాత్రి చెన్నూరు 11 వ వార్డులోని ఇంటింటికి వెళ్లి విద్యార్థులతో, తల్లిదండ్రులతో పాఠశాలల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలలో ఉపాధ్యాయులు సక్రమంగా పాఠాలు చెబుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. విద్యార్థుల పుస్తకాలు, బ్యాగులు పరిశీలించారు. విద్యార్థులకు అన్ని పాఠ్య పుస్తకాలు అందాయా, ఇంకా ఏమన్నా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో తరగతి గదులు, మౌలిక వసతులు ఎలా ఉన్నాయి, ఉపాధ్యాయుల పనితీరు పై ఆరా తీశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికీ ఏమైనా మార్పు కనపడిందా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను అడిగారు. గతంలో కంటే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు బాగున్నాయని, విద్యార్థులు కూడా బాగా చదువుతున్నారని, మంచి భోజనం పెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

**ప్రతి తరగతి గది క్షుణ్ణంగా పరిపరిశీలన**

మైదుకూరు : విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రాత్రి మైదుకూరు జెడ్పీ హైస్కూల్ (బాలురు, బాలికలు )లోని తరగతి గదిని తనిఖీ చేశారు. పాఠశాలకు 12 డిజిటల్ బోర్డులు రాగా వాటిని ఆయన ఆన్ చేయించి తనిఖీ చేశారు.

# కడప, కర్నూలు జట్ల విజయం



వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో తలపడుతున్న కర్నూలు, నెల్లూరు జట్లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ- అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం కడప, కర్నూలు జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. జట్టులోని సుతేజ్ రెడ్డి 67 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ అక్షిత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 42 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. జట్టులోని మనోజ్‌రాజు 44, యగ్నేశ్వర్ 36 పరుగులు చేశారు. దీంతో కర్నూలు జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

**కడప జట్టుకు రెండో విజయం..**

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 47.5 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రెడ్డిరుషీల్ 65 పరుగులు చేశాడు. కడప బౌలర్లు మహమ్మద్ అయూబ్ 3, అర్థిత్‌రెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 47.5 ఓవర్లలో 248 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని రోహిత్‌వర్మ 63 పరుగులు చేశాడు. ఈయనకు జతగా ఆర్. ప్రణీల్ 48, ప్రణవ్‌రెడ్డి 34, ఎస్. మహమ్మద్ 27, సి. విజయ్‌రామిరెడ్డి 20 పరుగులు చేశారు. దీంతో కడప జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

## గోడౌన్ ట్రక్కుల్లో డీజిల్ చోరీ

**ప్రొద్దుటూరు :** ప్రొద్దుటూరు పౌరసరఫరాల శాఖ సంస్థ గోడౌన్‌లోని ట్రక్కుల్లో డీజిల్ చోరీ అయిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. గోడౌన్ నుంచి చౌక దుకాణాలకు నిత్యావసర వస్తువులు సరఫరా చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్టర్ల ద్వారా ఆరు ట్రక్కులను ఏర్పాటు చేసింది. యథా ప్రకారం గురువారం రాత్రి సరుకులు చేరవేసిన అనంతరం ట్రక్కులను గోడౌన్‌లో నిలిపి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు 4 ట్రక్కుల్లోని డీజిల్‌ను చోరీ చేశారు. మరో ట్రక్కులోని డీజిల్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా తాళాలు రాకపోవడంతో వదిలేసి వెళ్లినట్లు తెలుస్తోంది. విలువైన నిత్యావసర వస్తువులు నిల్వ ఉన్న గోడౌన్‌లో పర్యవేక్షణకు సంబంధించి ప్రత్యేకంగా సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. అయినా యథేచ్ఛగా ఈ చోరీ జరిగింది. గతంలో రెండు మార్లు ఇదే తరహాలో డీజిల్ చోరీకి గురైనట్లు హమాలీలే స్వయంగా చెబుతున్నారు. ఈ సంఘటనపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెలలోనే బియ్యం రవాణాకి సంబంధించి జరిగిన సంఘటనలో పెద్ద ఎత్తున వార్తలు రావడం, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణారెడ్డిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితమే పోరుమామిళ్లలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గురుబాబు ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. పటిష్టమైన నిఘా లేకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశం లేకపోలేదు.

## గొడవలో గాయపడ్డ వ్యక్తి మృతి


గాయపడ్డ నాగభూషణం

**చింతకొమ్మదిన్నె :** మండల పరిధి కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో ఓ హోటల్‌లో జరిగిన ఘర్షణలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లి గ్రామానికి చెందిన నాగభూషణం (38)తోపాటు ఖాసీం, మరో వ్యక్తి కూలీ పనుల నిమిత్తం ట్రాక్టర్‌కు వెళ్లే వారు. వీరికి గతంలో చిన్న వాదులాటలు జరిగి మనస్పర్థలు ఏర్పడ్డాయి. గురువారం మధ్యాహ్నం భోజనం తినేందుకు ఓ హోటల్‌కు వెళ్లారు. అక్కడ మాటకుమాట పెరగడంతో నాగభూషణంను ఖాసీంతోపాటు మరో వ్యక్తి తలపై రీపర్ చెక్కతో బలంగా కొట్టారు. దీంతో ఆయన తలకు బలమైన గాయమై, తీవ్ర రక్తస్రావం అయింది. గమనించిన స్థానికులు 108 సాయంతో బాధితుడిని రిమ్స్‌కు తరలించారు. అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.





# వైద్యుడా.. వందనం

నేడు వైద్యుల దినోత్సవం

**కడప కల్చరల్ :** వైద్యోనారాయణ హరీ...! అంటారు. మానవాళిలో వైద్యుడు.. అంతటి గొప్పవారు. అనారోగ్యంతో బాధపడే, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడే శక్తి కేవలం వైద్యునికే ఉంది. అందుకే ప్రజలు వైద్యుడిని సాక్షాత్తు దేవుడిగా భావిస్తారు. బెంగాల్‌కు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బిదన్ చంద్రారాయ్ సంస్మరణగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని దేశమంతటా నిర్వహిస్తున్నారు. ఆయన 1882 జూలై 1న జన్మించారు. 1962 జూలై 1న కన్నుమూశారు. 1991 నుంచి ఆయన సంస్మరణగా వైద్యలోకం డాక్టర్స్ డే నిర్వహిస్తోంది.

**దేవ వైద్యుడు**

మానవులకే కాకుండా దేవతలకు కూడా వైద్యుడు ఉన్నాడు. ఆయనే ధన్వంతరి. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ వైద్యనాథస్వామి ఆలయంలో మూల విరాట్ ఎదురుగా గోడపై ధన్వంతరి కుడ్య శిల్పం ఉంది. పురాణాలు ఆయనను దేవతల వైద్యునిగా పేర్కొంటున్నాయి. అందుకే ఈ దేవాలయంలోని శివునికి వైద్య నాథుడు అని పేరొచ్చింది. ఒకప్పుడు దేవాలయాలే వైద్యాలయాలుగా కూడా సేవలు అందించేవి. చుట్టుపక్కలగల అడవుల్లో లభించే ఆకులు, గరుడు, వేళ్ల తదితరాలను ఆలయాల అరుగులపై గుండ్రాళ్లతో మెత్తగా నూరేవారు. ఆ పసర్లతో స్థానికులకు వైద్యం చేసేవారని, అందుకు నిదర్శనంగా జిల్లాలోని పలు దేవాలయాల అరుగులపై నేటికీ మందులు నూరిన గుర్తుగా కల్వాలు (అరుగులపై మందును నూరిన గుర్తులు) కనిపిస్తాయి.

**చరిత్రలో..**

జిల్లాను బ్రిటీషు వారు పాలించే రోజుల్లో కడప నగరంలో హకీం మంజుమియాకు మంచి వైద్యునిగా పేరుంది. యునాని వైద్యునిగా ఆయన ఎంతో విశిష్టత సాధించారు. దేశం నలుమూలల నుంచి ప్రజలు వైద్యం పొందేందుకు ఆయన వద్దకు వచ్చేవారు. ప్రస్తుతం కడప నగరంలోని సిండికేట్‌బ్యాంకు ఉన్నచోట ఆయన వైద్యశాల ఉండేదని, పేదల వద్ద ఎలాంటి రుసుం తీసుకోకుండా మందులు కూడా ఉచితంగా ఇచ్చేవారని తెలుస్తోంది. ఎందరో నవాబులు, రాజులు తమ సంస్థానానికి వస్తే పెద్ద ఎత్తున ధనం, గౌరవం ఇస్తామని ఆశ పెట్టినా ఆయన కడపలోని పేదలకు వైద్య సేవలు అందించాలని ఇక్కడే ఉండిపోయారు. ఆయన ప్రతిభ గురించి ఎన్నో విశేషమైన కథనాలు ప్రచారంలో ఉన్నాయి. రోగి స్వయంగా రాలేకపోయినా వారి తల వెంట్రుక గానీ, గోరు గానీ చూపితే వ్యాధి నిర్ధారణ చేసి రోగాలు నయం చేసేవారని ప్రచారంలో ఉంది. ముఖం చూసిన వెంటనే వ్యాధి ఏమిటో చెప్పగలిగే వారని కూడా పేరుంది.

**హృదయాలలో కొలువైన వైద్యుడు.. వైఎస్సార్**

జిల్లాకు చెందిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యుడన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుళ్లిపోయిన రాజకీయాలకు తనదైన శైలిలో సామాజిక వైద్యం చేశారు. ఆయన ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ, 108, 104 వాహనాల సేవలను ప్రవేశపెట్టి 15 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ ప్రజలు గుర్తు చేసుకుంటూ ఉంటారు. ఆ కుటుంబానికి చెందిన వైఎస్ పురుషోత్తమరెడ్డి, ప్రస్తుత జమ్మలమడుగు శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, అంతకు ముందు వెంకటసుబ్బయ్య, శివరామకృష్ణయ్య మరికొందరు డాక్టర్లు ఎమ్మెల్యేలు అయ్యారు.

**డాక్టర్ల వీధి**

కడప నగరం క్రిస్టియన్‌లేన్‌కు డాక్టర్ల వీధిగా పేరుంది. దాదాపు రెండు వందల మీటర్ల పొడవు గల ఆ వీధిలో ఒక్కటంటే ఒక్కటి కూడా నివాస గృహం లేదంటే అతిశయోక్తి కాదు. రోడ్డుకు ఇరువైపులా దాదాపు అన్ని వైద్యశాలలే. అవిగాక స్కానింగ్ సెంటర్లు, ల్యాబొరేటరీలు, అడుగడుగునా మందుల దుకాణాలు ఉన్నాయి. తెలుగునాట ఇలాంటి వీధి మరేది లేదంటారు.

**జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటుకు చర్యలు**

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్యుల సంఖ్య, మెడికల్ కళాశాలల సంఖ్య కూడా పెరగాల్సిన అవసరం ఉంది. దీన్ని గుర్తించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కళాశాలను ప్రకటించింది. ఈ ప్రణాళిక సాకారమైతే రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ వైద్యుల కొరత ఉండదు. దాంతోపాటు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.

### గౌరవప్రదంగా చూసుకోవాలి



సమాజంలో డాక్టర్స్‌ను గౌరవించకపోవడం వలన వారి ప్రాముఖ్యత తగ్గిపోతోంది. ఎలాంటి భయంకరమైన జబ్బులు వచ్చినా, డాక్టర్సే దానికి వైద్యం చేసి నయం చేయాల్సి వుంది. పేషెంట్లకు తమ కుటుంబ సభ్యుల మాదిరిగా ట్రీట్‌మెంట్ అందించడం ప్రతి వైద్యుడు బాధ్యతగా నిర్వహిస్తాడు. సామాజిక బాధ్యతగా భావించి వైద్యం చేసే ప్రతి వైద్యుడిని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. – డాక్టర్ మనోహర్ కోటకొండ, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, రిమ్స్, కడప

### కోవిడ్ సమయంలో..



ప్రపంచ మానవాళిని భయంకరమైన కోవిడ్ మహమ్మారి నుంచి కాపాడింది వైద్యులే. తమ కుటుంబ సభ్యులకు దూరంగా వుంటూ వైద్య సేవలు అందించారు. కడప రిమ్స్ ఆసుపత్రిలో ఓపి, ఐపి విభాగాల్లో వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలను అందించడం కోసం అందరి డాక్టర్ల సహకారంతో విశేషంగా కృషి చేస్తాం. ప్రతి వైద్యుడు అంకితభావంతో పని చేస్తున్నారు. – డాక్టర్ రమాదేవి, రిమ్స్, సూపరింటెండెంట్, కడప

### పునరంకితమవుతున్నాం



ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలలో వైద్యులను ప్రతి ఏడాది 150 నుంచి 175 మందిని తయారు చేస్తున్నాం. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లా ప్రజలకు అందించిన వైద్య వరం రిమ్స్. ఇక్కడ పీజీ వైద్య విద్యను, సూపర్ స్పెషాలిటీ సేవలను విస్తరింపచేస్తున్నాం. వైద్య వృత్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. అపుడే సమాజంలో వైద్య వృత్తికి మరింత మెరుగైన స్థానం లభిస్తుంది. – డాక్టర్ ఏ. సురేఖ, ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల(రిమ్స్),కడప

## ఇరు వర్గాల ఘర్షణ

**లింగాల :** మండలంలోని అంకేవానిపల్లె గ్రామంలో పొలం గట్టుపై నిప్పు పెట్టారన్న విషయమై ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డాయి. దిద్దేకుంట శ్రీరామిరెడ్డి, దిద్దేకుంట కిశోర్‌రెడ్డి అనే ఇరు వర్గాల వారు కర్రలు, కొడవళ్లతో దాడి చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ హృషికేశవరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను అదుపులోకి తీసుకుని గాయపడిన వారిని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించా రు. ఇరువర్గాల వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థి అదృశ్యం

**కడప అర్బన్ :** కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్రాల గడ్డ సమీపంలో నివాసం వుంటున్న షేక్ జమాల్ అనే వ్యక్తి కుమారుడు షేక్ మహ్మద్ (14) అనే విద్యార్థి ఈనెల 26 నుంచి కనిపించడం లేదని శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఐదవ తరగతి వరకు చదువుకున్న షేక్ మహ్మద్‌ను ఆ పై తరగతులలో చేర్పించేందుకు సిద్ధం చేస్తుండగా విషయం తెలుసుకుని పరారయ్యాడు. అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టిన ట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.మధుసూధన్‌రెడ్డి తెలియజేశారు.

## ఢీకొన్న టిప్పర్, మినీ వ్యాను

– తప్పిన ప్రమాదం

**ముద్దనూరు :** ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన రహదారిలో యామవరం శివారులో శుక్రవారం సాయంత్రం టిప్పర్, మినీ వ్యాను ఢీకొన్న సంఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. పోలీసుల సమాచారం మేరకు.. యామవరంలోని కాలనీలోకి ఓ ప్రైవేటు పాఠశాల పిల్లలతో వెళ్తున్న మినీ వ్యానును టిప్పర్ ఢీకొంది. ఈ రెండు ఢీకొన్న సమయంలో వెనుక వైపు నుంచి డీజిల్ లోడుతో ట్యాంకరు కూడా వస్తోంది..అయితే ఈ సంఘటనలో ట్యాంకరు డ్రైవరు అప్రమత్తంగా వ్యవహరించడంతో డీజిల్‌తో వున్న ట్యాంకరుకు ప్రమాదం తప్పింది. డీజిల్ ట్యాంకరు, టిప్పరు, వ్యాను మూడు ఢీకొని వుంటే పెద్ద ప్రమాదం జరిగివుండేదని, అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్

**వేంపల్లె :** మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గొల్లపల్లె శివ నారాయణను అత్యాచారం కేసులో అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళను అతను ఈనెల 27న అత్యాచారం చేయడానికి ప్రయత్నించినట్లు బాధిత కుటుంబం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా.. 15 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## నమ్మకద్రోహంపై కేసు నమోదు

**కడప అర్బన్ :** కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్లం మండి వీధికి చెందిన షేక్ రహమతుల్లాకు సంబంధించిన డబ్బులను మనోహర్ దగ్గరి నుంచి తీసుకురావడానికి షేక్ కరీముల్లా ఒప్పుకున్నాడు. ఈక్రమంలో డబ్బులపై దురాశ పుట్టి వెంటనే షేక్ కరీముల్లా మరో ఐదుగురితో కలిసి రూ.8.50 లక్షలు తీసుకుని పరారయ్యాడు. కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

## రైతు కుటుంబానికి న్యాయం చేస్తాం : ఆర్డీఓ

**కడప సెవెన్‌రోడ్స్ :** ఖాజీపేట మండలం తుడుములదిన్నె గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు వెంకటసుబ్బారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన న్యాయం చేస్తామని కడప ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామం సర్వే నంబర్ 321/3లో 1.54 ఎకరాలు వెబ్‌ల్యాండ్‌లో మృతుని తల్లి కె.సుబ్బలక్షుమ్మ పేరిట నమోదై ఉందన్నారు. ఆమెకు వెంకటసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి కుమారులు ఉన్నారన్నారు. వీరిలో వెంకటసుబ్బారెడ్డి సదరు భూమి రిజిష్టర్ కావడం లేదని స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారని పేర్కొన్నారు. ఖాజీపేట తహసీల్దార్ అర్జీని విచారించి ఆ భూమి ఆర్‌ఎస్‌ఆర్ ప్రకారం చుక్కల భూమిగా నమోదై ఉందని, కనుక రిజిష్టర్ చేసేందుకు, ఆన్‌లైన్ నమోదు చేసేందుకు వీలులేదని తెలిపారన్నారు. ఆ భూమిని పట్టాభూమిగా మార్పు చేయాలంటే అన్నదమ్ములంతా ఒక అవగాహనకు వచ్చి మీసేవలో దరఖాస్తు చేయాలని ఈనెల 13వతేదీ అర్జీదారుకు ఎండార్స్‌మెంట్ ద్వారా తెలిపామన్నారు. అయితే కుటుంబసభ్యుల మధ్య సరైన అవగాహన లేకపోవడం వల్ల సదరు భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు మీసేవ, సచివాలయంలో నమోదు చేసుకోలేదన్నారు. వెంకటసుబ్బారెడ్డి ఇతర రైతుల నుంచి 10 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేస్తున్నారని, కౌలు కూడా సకాలంలోనే చెల్లిస్తున్నారని తెలిపారు. ఆత్మహత్య సంఘటనపై పూర్తి స్థాయి విచారణ చేసి పైఅధికారులకు నివేదిక పంపి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

## ద్విచక్రవాహనాలు ఢీకొని యువకుడి మృతి

**కలికిరి :** ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఏఎస్ఐ మధుసూదనాచారి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పత్తేగడ గ్రామం పాళెంకు చెందిన శివకుమార్(28), నవీన్ శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంలో కలికిరికి బయలుదేరారు. కలికిరి వైపు నుంచి హర్షవర్ధన్, మహమ్మద్ ద్విచక్రవాహనంలో వస్తున్నారు. మార్గంమధ్యలోని కలికిరి సమీపాన యర్రపల్లి వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వీరిని కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శివకుమార్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య నవనీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## గోడ కూలి ముగ్గురికి గాయాలు

**మదనపల్లె :** మూడో అంతస్తుపై నిర్మిస్తున్న గోడ కూలి పక్కనే ఉన్న ఓ బంకుపై పడి ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మారుతీనగర్‌లో గుర్రప్ప(58) బార్బర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన రామకృష్ణ(60), రెడ్డెప్ప(52)లు షేవింగ్ కోసం అక్కడికి వచ్చారు. బార్బర్‌షాపు పక్కనే చలమయ్య ఇంటి నిర్మాణంలో భాగంగా మూడో అంతస్తులో నిర్మిస్తున్న గోడ.. సాయంత్రం నుంచి పడుతున్న వర్షానికి తడిసి ఉన్నపళంగా పక్కనున్న బార్బర్‌షాపుపై కుప్పకూలింది. దీంతో షాపులో ఉన్న యజమాని గుర్రప్ప, రామకృష్ణ, రెడ్డెప్ప తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బస్సులో నుంచి పడి..

**మదనపల్లె :** బస్సులో నుంచి ప్రమాదవశాత్తు బిచ్చగాడు కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం జరిగింది. మదనపల్లెకు చెందిన దాసప్ప(65) బస్సులో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. అందులో భాగంగా ప్రతి రోజు మదనపల్లె నుంచి చీకలబైలు వరకు ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణిస్తూ భిక్షాటన చేసేవాడు. యథావిధిగా శుక్రవారం ఉదయం మదనపల్లెలో ఓ ప్రైవేట్‌బస్సు ఎక్కి మదనపల్లె మండల సరిహద్దు అయిన చీకలబైలు వరకు వెళ్లాడు. బస్సులో నుంచి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతడి కాలుపై బస్సు వెనుక చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు మహిళలకు ఏపీఎన్ఆర్‌టీఎస్ చేయూత


తలారి లక్ష్మికి తాత్కాలిక పాస్‌పోర్టు పత్రాలు అందజేస్తున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు

**కడప కార్పొరేషన్ :** పాస్‌పోర్టులు లేక కువైట్‌లో ఇబ్బందులు పడుతున్న ఇద్దరు మహిళలకు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్‌టీఎస్) చేయూతనందించింది. ఆ సంస్థ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన తలారి లక్ష్మి, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన షేక్ షబీనాలు మూడేళ్ల క్రితం హౌస్ మెయిడ్(ఇంటి పని) కోసం కువైట్‌కు వచ్చారు. స్పాన్సర్ ఇంట్లో పని ఎక్కువగా ఉండటం, పైగా తిట్టి, కొట్టడాన్ని భరించలేక ఇళ్ల నుంచి పారిపోయారు. కువైటీల ఇళ్ల నుంచి పారిపోయి వచ్చాక ఎక్కడ ఉండాలో అర్థం కాక అవస్థలు పడుతున్న వారికి ఏపీఎన్ఆర్‌టీఎస్ ప్రొవిజనల్ కో ఆర్డినేటర్ ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆశ్రయం కల్పించారు. రెండు నెలల పాటు వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. వారిద్దరికీ పాస్‌పోర్టులు లేనందున భారత రాయబార అధికారుల సహాయంతో తాత్కాలిక పాస్‌పోర్టులు తయారు చేయించి ఇండియాకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 29వ తేది వారు ఎయిర్ ఇండియా విమానంలో బయలుదేరి 30 తేది హైదరాబాద్‌కు చేరుకుని వారి స్వస్థలాలకు వెళ్లారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు మాట్లాడుతూ తమకు అన్ని విధాలుగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భారత రాయబార అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్, కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ ఎన్. మహేశ్వర్‌రెడ్డి, ప్రొవిజనల్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## కడపలో పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చింది

రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి


రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి దంపతులను సన్మానిస్తున్న కడప బార్ అసోసియేషన్ వారు

**కడప అర్బన్ :** తాను గతంలో పలు చోట్ల జడ్జిగా పని చేశానని, అయితే కడపలో జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన రోజులు ఎంతో సంతృప్తిని ఇచ్చాయని రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం పదవీ విరమణ పొందిన సందర్భంగా కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు పీఎస్ బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి వై.టీ.జె కెనడీ, బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ తాను పని చేసిన రెండు నెలల కాలంలోనే 75 కేసులను న్యాయవాదుల సహకారంతో పరిష్కరించగలిగానన్నారు. తనకు న్యాయవాదులు అందించిన సహకారం ఎన్నటికీ మరువలేనిదని చెప్పారు. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తిగా ఆయన పదవి విరమణ చేసినా, న్యాయవ్యవస్థకు దూరం కాదని తాము భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. అన్నపూర్ణమ్మ, ఆరవ అదనపు జిల్లా జడ్జి ఇంతియాజ్ అహ్మద్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి గీత, అడిషనల్ సబ్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత, న్యాయమూర్తులు స్రవంతి, నందిని, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## వడ్డెర్ల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి


మాట్లాడుతున్న వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్ రేవతి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

**పులివెందుల రూరల్ :** వడ్డెరుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్ రేవతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబకపల్లె రోడ్డులో ఉన్న ఫిష్ ఆంధ్రా కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎక్కువశాతం ఉన్న బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 130 బీసీ కులాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో 560 చైర్మన్లు, 672 డైరెక్టర్లను నియమించడం జరిగిందన్నారు. అందులో ఎక్కువ శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించారని పేర్కొన్నారు. వడ్డెరులకు ఉన్నతమైన పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. 2019 ఎన్నికలలో చెప్పిన విధంగా ఎమ్మెల్సీ స్థానాలు, మున్సిపల్ చైర్మన్, కార్పొరేషన్ చైర్మన్లు ఇచ్చి.. మాట నిలబెట్టుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వడ్డెర చైతన్య యాత్రలో భాగంగా పులివెందులకు రావడం జరిగిందన్నారు. అనంతరం ఆమెను వడ్డెర కులస్తులు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘ నాయకులు కొండయ్య, మునీంద్ర, ఏపీఎంలు ఆంజనేయులు, గురుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

**వాల్మీకిపురం :** మండలంలోని చింతపర్తి పంచాయతీ పాతకోటపల్లికి చెందిన ఓ వివాహిత చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకొంది. సీఐ సురేష్ కుమార్ కథనం మేరకు.. పాతకోటపల్లికి చెందిన గంగాధర్ భార్య సరస్వతమ్మ (45) శుక్రవారం గ్రామ శివారు ప్రాంతంలోని చింతచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి సరస్వతమ్మ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై నాగేశ్వర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కుటుంబ సమస్యలతో..**

**మదనపల్లె :** కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. పట్టణంలోని శేషప్పతోటకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు బాబు భార్య సోని(34) భర్త మందలించిన కారణంగా మాత్రలు మింగి ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. బాబు పనుల నుంచి రాత్రి ఇంటికి రాగా వారి ఇద్దరి పిల్లలు గొడవపడుతున్నారు. వారిని పట్టించుకోకుండా ఉన్న భార్య సోనిని పిల్లలను ఎందుకు పట్టించుకోవడం లేదంటూ మందలించాడు. అయితే అప్పటికే భార్యాభర్తల మధ్య, కుటుంబ సమస్యలతో మనస్పర్థలు ఉండటంతో మనస్తాపం చెందిన సోని ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు సోనిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందజేశారు.

* మనం మాట్లాడుకోవాల్సిందే!

అధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

# డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

•••

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.


ప్రతీకాత్మక చిత్రం

## కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లీ, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

•••

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

### సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

### కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

### అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కొవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

న్యూస్‌మేకర్


సాబ్రి

# మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

■ **దేవుని గుడిలో చూసి..**

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

■ **మగవారికే కథాకళి**

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్టాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

■ **కఠిన శిక్షణ**

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్థుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

**నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హాయిగా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.**

# పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

**తొమ్మిదేళ్లకే కాలేజీ..**

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

**ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ**

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. ఆ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటిలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటి, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

**నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాడియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...**

# ది బాస్ లేడీ


ఆష్క గొరాడియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాడియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవీ సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

**కల కనాలి... ముందుకు కదలాలి:** ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

**అంకితభావం ప్లస్ కష్టం:** నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

**రిస్క్‌కు భయపడితే రిస్క్:** ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.

కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

**నెట్‌వర్క్:** నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

**యుఎస్పీ:** 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.




"నా నెక్స్ట్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా, నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.